సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎంగా జగనే రావాలి

మాచవరం: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా మంజూరైన నిధుల వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన అందిస్తూ, అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అందిస్తూ, గ్రామాలు ఆర్థికంగా ఎదిగేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత నాలున్నరేళ్లగా పాలన అందిస్తోందన్నారు. రాష్ట్రంలో అలాంటి సుభిక్ష పాలన కొనసాగాలంటే మరలా ఏపీకి సీఎంగా జగనే రావాలని ప్రజలు అంకాక్షిస్తున్నట్లు చెప్పారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో కలిసి నాలున్నరేళ్లల్లో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైస్సార్ సీపీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి

పాలువాయి(రెంటచింతల): రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ అవసరం ఎందుకు అనే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని పాలువాయి గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె సర్పంచ్ మందలపు విజయలక్ష్మిలచ్చిరెడ్డి, పార్టీ నాయకులతో కలసి వలంటీర్లకు ప్రచార కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పార్టీ నేతలతో కలసి గ్రామంలోని ఇంటింటికి వెళ్లి సీఎం జగన్ నేతృత్వంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ఆపు బాబు నాటకం– జగనే మా నమ్మకం అంటూ ప్రచారం చేయాలన్నారు. ముందుగా గ్రామంలోని ప్రధాన సెంటర్లో ఉన్న వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, ఈఓపీఆర్డీ అనంత కోటేశ్వరరావు, పార్టీ నేతలు యర్రెద్దు చంద్రారెడ్డి, కొక్కండ్ల బ్రహ్మం, తియగూర హనిమిరెడ్డి, వట్టి గోవిందరెడ్డి, శొంఠిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ములకా ప్రభాకర్‌రెడ్డి, యర్రెద్దు శ్రీనివాసరెడ్డి, పేర్ల ముత్తయ్య, దూదేకుల మస్తాన్, కొమ్ము సైదులు, తమ్మిశెట్టి శ్రీను, గణేష్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సింగరయ్య


పాలువాయిలో లబ్ధిబోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి లచ్చిరెడ్డి, ఎంపీపీ చౌడేశ్వరి


పాలువాయిలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న సర్పంచ్ విజయలక్ష్మిలచ్చిరెడ్డి, ఎంపీపీ చౌడేశ్వరి


13వ సచివాలయంలో బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

రాష్ట్రానికి జగన్ ఎంత అవసరమో తెలియజేయాలి

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి, గత టీడీపీ ప్రభుత్వం చేసిన నమ్మక ద్రోహాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంత ఉందో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం మనందరిపై ఉందని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలోని 13వ సచివాయలంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే తరాలు బాగుపడాలంటే జగన్ రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుందుర్తి గురవాచారి, కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, అన్నెం పద్మావతి, జూలకంటి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ సైదులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తుల నాగిరెడ్డి, అన్నెం బంగారెడ్డి, వెన్నా శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎస్ ముక్కాల పిచ్చయ్య, వెలిశల కృష్ణ, పిల్లి ప్రేమానందం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చరిత్రలో ఎన్నికల హామీలు నెరవేర్చింది సీఎం జగన్ ఒక్కరే

కారెంపూడి: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కారెంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించారు. గత నాలుగున్నరేళ్లలో పేద మధ్య తరగతి ప్రజల సంక్షేమం, విద్య, ఆరోగ్యం పట్ల చూపిన శ్రద్ధతో పాటు రాష్ట్ర చరిత్రలో ఏ పాలకుడు నెరవేర్చని ఎన్నికల వాగ్దానాలలో 95 శాతంపైగా నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రజా ప్రతినిధులు, నాయకులు ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ అల్లు వెంకటేశ్వర రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, వైస్ఎంపీపీ బొమ్మిన అల్లయ్యసావిత్రి, గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల రమణ, మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీటీసీ షఫీ

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే జగనే సీఎం కావాలి

వెల్దుర్తి: ఆంధ్ర రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డే ఉండాలని ఎంపీపీ చింతా శివరామయ్య సోమవారం అన్నారు. మండలంలోని పట్లవీడు గ్రామ సచివాలయ పరిధిలోని పట్లవీడు, యర్రబాలెం, శివలింగాపురం గ్రామాలలో ఆంధ్ర రాష్ట్రానికి సీఎం జగనే ఎందుకావాలి అనే కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ చింతా శివరామయ్య మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నారన్నారు. సచివాలయ పరిధిలోని సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా రూ. 14.21కోట్లు ఖర్చుచేశారన్నారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు చల్లా పిచ్చయ్య, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మేకల కోటిరెడ్డి, కండ్లకుంట సొసైటీ అధ్యక్షుడు తాడికొండ పుల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ చల్లా శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ బొజ్జా అంజిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసరెడ్డి, వెంకటనారాయణ, శ్రీనివాసరెడ్డి, ఆంజనేయులు, నాగేశ్వరరావు, చౌడయ్య, ఇన్నయ్య, వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


పథకాల బోర్డును ప్రారంభిస్తున్న దృశ్యం

గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి


సర్పంచ్‌గా ఎన్నికైన పీత వీరరాఘవయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ జంగా, తదితరులు

పిడుగురాళ్లరూరల్: గ్రామాభివృద్ధికి సర్పంచ్, వార్డు సభ్యులు సమష్టిగా కృషి చేసి గ్రామానికి వన్నె తీసుకురావాలని శాసన మండలి విప్, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్‌గా పీత వీరరాఘవయ్య ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పంచాయతీ సెక్రటరీ సర్పంచ్‌గా ఎన్నికైన వీరరాఘవయ్యచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ...ప్రజలకు ఎప్పటికప్పుడు సేవలు చేస్తూ ముందుకు నడవాలని సూచించారు. పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షేక్ బడేషా ఖాశింబి, యర్రంరెడ్డి చంద్రారెడ్డి, బండి రామిరెడ్డి, అంజిరెడ్డి, ఎంపీటీసీలు నాగిరెడ్డి, శ్రీనివాసరావు, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అద్దంకి శ్రీనివాసరావు, గ్రామ సీనియర్ నాయకులు జొన్నల ఆదిరెడ్డి, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ రామిరెడ్డి పాల్గొన్నారు.

రేపు 11 వాహనాలకు వేలం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన 5 మోటారు సైకిళ్లు, 6 ఆటోలు కలిపి మొత్తం 11 వాహనాలకు పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కన్ఫిస్కేషన్ అథారిటీ ఉత్తర్వుల మేరకు గురజాల ఎస్‌డీపీవో ఆధ్వర్యంలో ఈ నెల 22న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ పి.అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు అదే రోజు ఉదయం 11 గంటలకు పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం

కారెంపూడి: కార్తీక మాసం తొలి సోమవారం స్థానిక పల్నాటి చెన్నకేశవస్వామి దేవాలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం వైభవంగా జరిగింది. గురుస్వాములు సింగం బాలకృష్ణ, గురువులు తదితరులు అయ్యప్ప స్వామికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. చెన్నకేశవస్వామి ఆలయ ఈఓ కృష్ణంరాజు, దేవాలయ ధర్మకర్త చల్లా వీర్లవర ప్రసాదరావు, దేవాలయ అర్చకుడు కొమండూరి సత్యనారాయణాచార్యులు దాతల సహకారంతో వందలాది మంది స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇదిలా ఉంటే కార్తీక సోమవారం ఆలయాలకు భక్తజనం పోటెత్తారు. వీర్ల అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామివారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని, కారెంపూడిలోని అన్ని ఆలయాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో కారెంపూడి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

కవి రవికుమార్‌కు జాతీయ స్థాయి సాహిత్య అవార్డు



దాచేపల్లి : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కవి కొసూరి రవికుమార్ జాతీయ సాహిత్య అవార్డును అందుకున్నారు. కవిగా, రచయితగా విశేష సేవలు అందించిన రవికుమార్‌ని హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న విమల సాహితీ సంస్థ గుర్తించి ఈ అవార్డును ప్రకటించింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరంటి వెంకన్న, తెలంగాణ ప్రభుత్వం జీఎస్టీ కమిషనర్ జెల్ది విద్యాసాగర్ చేతుల మీదుగా ఈ అవార్డుని రవికుమార్ అందుకున్నారు. రవికుమార్ కవిగా, కథ రచయితగా చేస్తున్న సేవలను అభినందించారు. జాతీయ స్థాయిలో సాహిత్య అవార్డును అందుకున్న రవికుమార్‌ని ఉపాధ్యాయులు అభినందించారు.

మాదినపాడు రోడ్డుకు మరమ్మతులు



దాచేపల్లి : మండలంలోని మాదినపాడు రోడ్డుకు మరమ్మతులు సోమవారం చేపట్టారు. ఈ రోడ్డులో పలు చోట్ల గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి రోడ్డు సమస్యను తీసుకెళ్లటంతో తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. దీంతో రోడ్డులో ఏర్పడిన గుంతలను పూడ్చే పనులు చేపట్టారు. స్థానిక ఆర్ అండ్ బీ అధికారులు పనులు పర్యవేక్షిస్తున్నారు.

భద్రతతో కూడిన పని ప్రగతికి మెట్టు



దాచేపల్లి : భద్రతతో కూడిన పని ప్రగతికి మెట్టు అని ప్లాంట్ హెడ్ పి.బిక్షారెడ్డి అన్నారు. మండలంలోని గామాలపాడు గ్రామ సమీపంలోని ఆంధ్రాసిమెంట్ ఫ్యాక్టరీలో 38వ గనుల భద్రత వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బిక్షారెడ్డి మాట్లాడుతూ...భద్రత చర్యలు తీసుకోకుండా పని చేసి ప్రమాదాల బారిన పడవద్దని, భద్రతతో పని చేసి పరిశ్రమ అభివృద్ధికి దోహదపడాలన్నారు. గనుల భద్రత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలైన కార్మికులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైన్స్ అధినేత నరసింహులు, నరేందర్ రెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతు ఆత్మహత్య



పెదకూరపాడు: అప్పుల బాధ తాళలేక కౌలు రైతు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన పెదకూరపాడు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకట్రావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ఆనందపేటకు చెందిన మేకల సుదర్శనం (49) అప్పుల బాధతో ఈనెల 12న తన ఇంట్లో గడ్డి మందు తాగాడు. స్థానికులు సత్తెనపల్లి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఈనెల 18న గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సుదర్శనం సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య శివకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

పేదవర్గాలకు లక్షల కోట్ల లబ్ధి చేకూర్చింది సీఎం జగన్

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


లబ్ధిదారురాలికి సంక్షేమ కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: రాష్ట్రంలో సంక్షేమం ద్వారా పేద వర్గాలకు లక్షల కోట్ల రూపాయాలు అందించి, కరోనా కాలం నుంచి ఇప్పటి వరకు అన్ని వర్గాల మనిషిగా కష్టపడుతూ ముందుకు వెళ్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందరు మద్దతు పలకాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహిళలు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి హారతులు పలికారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లగా వృద్ధులు, అక్క చెల్లెమ్మలు ఎమ్మెల్యే కాసును ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలోని ప్రతి గడపకు అర్హత ప్రకారం సంక్షేమ పథకాలు అందించారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామ నడిబొడ్డున ఉన్న సచివాలయం ద్వారా ఏ సంక్షేమ పథకానికి దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి ఆ సంక్షేమ పథకం చేకూరుతుందని, జనన మరణ, ధృవీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు కూడా ఈ రోజు గ్రామ నడిబొడ్డున సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ద్వారా అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలను ఎలా కత్తెరించాలని ఆలోచనతో పరిపాలన చేయగా నేడు జగనన్న ప్రభుత్వం అర్హుల ఇంటింటికి తిరిగి మరీ పారదర్శకంగా లబ్ధి చేకూరుస్తుందన్నారు. గ్రామానికి ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రూ.25,14,43,285 ఖాతాలలో జమ అయ్యాయని, అవినీతి లేకుండా, అర్హత ఉంటే సంక్షేమం మీ ఇంటికి నడిచి వచ్చిందన్నారు. నాన్ డీబీటీ ద్వారా రూ.7,21,98,017 లబ్ధి చేకూరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి సత్యవతి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ పి.వీరరాఘవయ్య, మాజీ సర్పంచ్ షేక్ ఖాశింబి బడేషా, ఎంపీటీసీలు నాగిరెడ్డి, శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి చంద్రారెడ్డి, పోలే బూదయ్య, బీసు పోగు వెంకటేశ్వర్లు, వెన్నా శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ అద్దంకి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు జొన్నల ఆదిరెడ్డి, కొండ్రు సీతయ్య, సైదులు, భూషి దాసు, భూషి కోటేశ్వరరావు(పెట్రోల్ బంకు కోటి) వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


కార్తీకమాసం ఎంతో విశిష్టం

తహసీల్దార్ పుల్లారావు

సత్రశాల(రెంటచింతల): శివ కేశవులిద్దరికీ అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసంలో నియమనిష్టలతో పరమశివుడిని ఆరాధిస్తూ పేదలకు, అనాథలకు దానాలు చేస్తే శివ కేశవుల అనుగ్రహం లభిస్తుందని తహసీల్దార్ కట్టికోట పుల్లారావు అన్నారు. కార్తీక మాసం తొలి సోమవారం పురస్కరించుకుని ఆయన ప్రసిద్ధి చెందిన అతిపురాతన శైవక్షేత్రం సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోప్యంగా చేసిన దానధర్మాలకు ఎక్కువ ఫలితాలు ఉంటాయన్నారు. కార్తీకమాసం ఎంతో విశిష్టమైనదన్నారు. సత్రశాల దేవస్థానంలో భక్తులకు వసతులను, ఈ మాసమంతా నిత్య అన్నదానం ఏర్పాటు చేసిన ట్రస్టీబోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, సభ్యులను అభినందించారు. అనంతరం తహసీల్దార్ పుల్లారావును చైర్మన్ బ్రహ్మారెడ్డి, అర్చకులు శివశర్మ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దాసరి కాంతారావు, వీఆర్వో పాశం నాసర్‌రెడ్డి తదితరులున్నారు.

సత్రశాలలో కార్తీక పూజలు...

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం సత్రశాల గంగా భ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానానికి కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివార్లను దర్శించుకున్న 2,500 మంది భక్తులకు, మాలధారులకు గోలి సర్పంచ్ మున్నా చంద్రం అన్నదానం చేశారు. ప్రధాన అర్చకులు చిట్టేలా శివశర్మ నేతృత్వంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, గణపతి, రుద్ర హోమాలు నిర్వహించారు. మంచికల్లు గ్రామానికి చెందిన నాగేంద్రస్వామి కోలాట బృందం మహిళలు ప్రదర్శించిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బాపనపల్లి శ్రీనివాసరావు, అర్చకులు ఎంపీపీ చౌడేశ్వరిని, సర్పంచ్ చంద్రంను సన్మానించారు.


తహసీల్దార్ పుల్లారావును సన్మానిస్తున్న దేవస్థానం ట్రస్టీబోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, అర్చకులు

విద్యార్థులు చదువును బాధ్యతగా భావించాలి

జెట్టిపాలెం(రెంటచింతల): ప్రతి విద్యార్థి చదువును బాధ్యతగా భావించాలని అప్పుడే వారు ఉన్నత శిఖరాలను చేరుకుంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.నాగమణి అన్నారు. సోమవారం మండలంలోని జెట్టిపాలెం సమీపంలో నున్న ఏపీ మోడల్ స్కూల్లో నిర్వహించిన బాలికను రక్షించు..బాలికను చదివించు(బేటీ బచావో..బేటీ పఢావో) కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను ప్రణాళికాబద్ధంగా అభ్యసించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బాలికల విద్యాభివృద్ధితో పాటు వారి ఆరోగ్యం కోసం, రక్షణకు అనేక చర్యలు చేపట్టిందన్నారు. గుడ్ టచ్..బ్యాడ్ టచ్ విషయంలో ప్రతి విద్యార్థిని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


బహుమతులను అందజేస్తున్న దృశ్యం

రెంటచింతల: విద్యతో పాటు పోటీ పరీక్షలకు కూడా విద్యార్థులు ప్రాధాన్యతను ఇచ్చి పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని అప్పుడే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకుంటారని మహాజన సోషలిస్టు పార్టీ పల్నాడు జిల్లా నాయకులు గడ్డిపర్తి శ్రీనివాసరావు అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం స్థానిక రెంటచింతల శాఖ గ్రంథాలయంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, డిబేట్ తదితర పోటీలలో విజేతలకు శ్రీనివాసరావు బహుమతులను అందచేసి మాట్లాడారు. పోటీ పరీక్షలలో విద్యార్థులు పాల్గొంటే వారిలో దాగిన ప్రతిభకు మెరుగులు దిద్దుకోవచ్చన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంతో ప్రయోజనం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్.రాజకిశోర్, ఉపాధ్యాయులు సరిత, పద్మశ్రీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో పెరగనున్న మేధాశక్తి

పిడుగురాళ్ల: పుస్తక పఠనంతో మేధాశక్తి పెరుగుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సభ పట్టణంలోని 19వ వార్డు ఎంపీపీ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివి ఎంతో మంది మేధావులయి ఉన్నత శిఖరాలను అధిరోహించారని తెలిపారు. విద్యార్థులు కూడా పాఠ్యపుస్తకాలతో పాటు గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి తమ మేధస్సుకు మరింత పదును పెట్టాలని అన్నారు. అనంతరం నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ భవన యజమాని శాఖమూరి నరసింహారావు, శాఖమూరి సురేష్, సాంఘిక సంక్షేమ బాలిక వసతి గృహం అధికారి పి.మాదవిలత, గ్రంథాలయ అధికారి కె.రాజశేఖర్, జగడం దేవదాసు, బి.మణికుమారి, ఎ.పద్మ విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి

విద్య ద్వారానే అన్ని రంగాల్లో అభివృద్ధి

మాచవరం: విద్య ద్వారానే సమాజాభివృద్ధితో పాటు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించవచ్చని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మాచవరం గ్రంథాలయంలో సోమవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా మహానుభావుల జీవిత చరిత్రలను, భాషా పరిజ్ఞానాన్ని తెలుసుకోవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆటల పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ సీమెచ్ గురవయ్య, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, బుడె, విజయకృష్ణ, వెంకటరావు, గ్రంథాలయ అధికారిణి బి.సుజాత, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ శివ

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

దుర్గి: మండల కేంద్రమైన దుర్గి గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించి సోమవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ ఎం.శివ హాజరై ప్రసంగించారు. తన విద్యార్థి జీవితంలో ఖాళీ సమయంలో గ్రంథాలయాలలో ఎక్కువ సమయాన్ని గడిపానన్నారు. పుస్తక పఠనం ద్వారా ఎంతో జ్ఞానాన్ని సంపాదించి తన లక్ష్యాన్ని చేరుకోవడంలో గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడ్డాయని తన అనుభవాన్ని విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ శాఖాధికారి పులిబండ్ల వేణుగోపి అధ్యక్షతన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి ఈ రోజు వరకు నిర్వహించిన కార్యక్రమాలకు సహకరించిన పలు పాఠశాలల ఉపాధ్యాయ, విద్యార్థులకు ముఖ్యంగా ఉపాధ్యాయులు అబ్బాసు, టి.లక్ష్మీనారాయణ, ఎం.మెర్సీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, రిటైర్డ్ ఎంఈఓ శెట్టిపల్లి గోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు కటకం చిన్న వెంకటయ్య, కోరే కొండలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాలు చేరిక


వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని 6,7,8 వార్డులకు చెందిన 30 టీడీపీ కుటుంబాల వారు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి టీడీపీకి చెందిన కార్యకర్తలు, నాయకులకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే కాసు చేస్తున్న అభివృద్ధిని చూసి తాము పార్టీలో చేరామని, వడియరాజులను క్వారీలకు యజమానులు చేసిన ఘనత ఎమ్మెల్యే కాసుకే దక్కుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తెచ్చేందుకు కష్టపడి పనిచేస్తామని చెప్పారు. పార్టీ వడియరాజులకు సముచిత స్థానం కల్పిస్తామని, మరిన్ని క్వారీ లీజులు ఇప్పించి అండగా ఉంటామని ఎమ్మెల్యే కాసు చెప్పారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో వేముల చిన్న కోటేశ్వరరావు, వేముల ప్రసాద్, వేముల బుడ్డోడు, వేముల కొండ, గుంజా కొండ, కొమెర శ్రీను, బత్తుల శ్రీను, వేముల జక్రయ్య, బత్తుల హనుమంతరావు, కొమెర వెంకటేశ్వర్లు, గోపి, గోపాల్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్ భాషా, కో ఆప్షన్ సభ్యుడు గుంజా వెంకటప్పయ్య, ఇన్‌చార్జిలు కుందురు తిరుపతిరెడ్డి, కనమర్లపూడి గోపి, నాయకులు కొప్పుల రామకృష్ణ, మర్రిబోయిన మహేష్, గుంజా వెంకట్రావ్, కొత్వాల్ సైదా తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

పెదకూరపాడు: బంధువుల నివాసానికి వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి రాడ్‌బిల్డింగ్ మేస్త్రీ మృతి చెందిన ఘటన మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన పగడాల ప్రసన్నకుమార్ (47) సోమవారం ఉదయం క్రోసూరు మండలం యర్రబాలెంలోని తన అత్త ఇంటికి వెళ్లాడు. తిరిగి వెళుతున్న సమయంలో మార్గమధ్యంలో మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న నీటి కుంటలో పడగా అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మూడు నెలల క్రితం అతని మామ నాగయ్య గుంటూరు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మామ పొలానికి సంబంధించిన సమస్యలపై అతను యర్రబాలెం వెళ్లాడు. ఒకే కుటుంబంలో మూడు నెలల వ్యవధిలో మామ, అల్లుడు మృతిచెందడంతో ఆ కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య ప్రసన్న ఉన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు.